కథానిక

# ఉదయాస్తమయాలు

'జయంతి'

అప్పుడు రోజులెంతో బాగాగడిచేవి. ధనమ్మ కంటబడుతూంటే సంవత్సరం ఒకనెలలా కనిపించేది. రాజమ్మత్త ఎంతో మంచిమనిషి. రోజూ ధనమ్మ 'నీపెళ్ళామే' అనేది. లోపల సంతోషం పొంగుతూన్నా పైకి 'కాదు' అనేవాడు. ఆమాట ధనమ్మకీ ఇష్టంలేదు. చాటున ఒకనాడు చెప్పవలసి వచ్చింది: 'పైకి అలా అంటా—అంతే— లోపల నాకెంత యిష్టం ధనం, నువ్వంటే!' అని. క్షీరాబ్ధి ద్వాదశికి ధనమ్మ పూజ చేసుకుని మొదట తనకే ప్రసాదంపెట్టేది. అట్లతద్దినాడు ఉట్టికింద ముద్ద తినిపించింది. ఇవన్నీ చూస్తే ఆడపిల్లలకి ఆపేక్ష ఎక్కువ అని అనిపించేది. తను మాత్రం తీసిపోయాడా! దీపావళికి బాణా సంచాలు చాటుగా తన భాగంకూడా ఆమెచేత కాల్పించేవాడు. ప్రభలసంబరానికి మిఠాయి పొట్లాలు అందిచ్చేవాడు. ఇదంతా చిన్ననాటిగాథ. తనకి జ్ఞానంవచ్చాక ధనమ్మ దూరమైపోయినా, ఆమెను గురించిన జ్ఞాపకాలు మాత్రం దూరమవలేదు. భర్తచావుతోనే రాజమ్మ ఆవూరునుంచి మకాం మార్చేసింది. అంతే. ఈ పదేళ్ళనుంచీ ఏమయిందో? ఒకటి మాత్రం సత్యం. ధనమ్మ పెద్దదై బాగా చదువుకుని కూడా వుంటుంది ఈపాటికి. ఏమైతేనేం, తాను మాత్రం ఎప్పటికైనా ధనమ్మని కలుసుకోవాలి.

ఇప్పుడు ఆమె పేరు స్వర్ణసుందరి. సువర్ణం వచ్చి సౌందర్యాన్ని వరించిందో, సౌందర్యమే వచ్చిసువర్ణాన్ని ఆరాధించిందో! ఏమైతేనేం ఆమె పేరు సువర్ణసుందరి- ధనమ్మకాదు. సినిమాలలో ఆమె పేరు మ్రోగిపోవడమేకాదు, మొన్న ఆమె నటించిన ఒక ఫిల్ము విదేశాలకి పోతుందని పుకారు. అంతేకాదు.ఆమెధనాన్ని విరివిగాఖర్చుపెడుతుంది. అంపరాజుగారి అబలాశ్రమానికి ఆరువేలు, వీరభద్రయ్యగారి వినయాశ్రమానికి వెయ్యి, బుద్ధారావుగారి పురాణమందిరానికి మూడువేలు, వసంతానందంగారి వస్త్రదానసమాజానికి పదివేలు దానమిచ్చినట్లు పత్రికల్లో చదివాడు భానుమూర్తి. ఏ రోజునైతే తన ధనమ్మే ఈ స్వర్ణసుందరి అని తెలిసిందో, కంటికి కునుకురాదు. ఈ గుమాస్తా ఉద్యోగం దెబ్బైరాళ్లూ ఎందుకింతా! పోయి ధనమ్మ దర్శనం చేస్తే చాలు ఈవుద్యోగాన్ని తన్ని పారెయ్యొచ్చు.

ఎలాగైతేనేం వచ్చాడు పట్టణానికి. తన జీవితంలో ఈ రోజు శుభదినం. యుగసంధ్య. నిన్నటి తన బ్రతుక్కీ, రేపటి తన బతుక్కీ సహస్రాంశం తేడా. తన కళ్ళముందు ప్రపంచమే మారిపోతుంది. ఇందాకా గేటువద్ద తన్నాపి రూపాయి లంచం పుచ్చుకొని లోపలికి వదిలిన గూర్ఖావాడు రేపు తన ముందు మోకరిల్లుతాడు. ఏదో గత జన్మలోని బాంధవ్యం తన్ని ధనమ్మ దగ్గరికి లాక్కొచ్చిట్లుంది. తన్ని చూడ్డమే తడవు. ఆమె గుండెల్లోన బాల్యదశ మెరుస్తుంది. 'పంఛీ, జా, పీఛేరహా హై బచపన్ మేరా ఉసాక్ లాకేదా'—'పక్షీ, వెళ్లు-వెనకపడివున్న నా బాల్యాన్ని లాక్కురా' అన్నాడు మానవ హృదయాలను తడిమి చూచిన సిద్ధహస్తుడొకడు.

ఒకవేళ తనూ సినిమాలలో నటించాలేమో! అంతకంటే కావలసిందేమిటి? ధనమ్మ హీరోయిన్, తాను హీరో......తన పేరు దశదిశలా మ్రోగిపోతుంది. ఈ అదృష్ట జాతకం ఎవరికి పడుతుంది?...త్యాగ కొంచెం ముందుకు జరిగింది. స్వర్ణసుందరితో ఇంటర్వ్యూ ముగించుకొని ఒక సూటుధారి వచ్చాడు బయటకి. భానుమూర్తికి ముందు పనిమంది. తాను పదకొండోవాడు. వెనకవున్న బొజ్జపంతులు లోకడు టై బిగించుకుంటున్నాడు. ఎందుకో వీళ్ళ తాపత్రయం?

తన్ను చూచిన తర్వాత ఇంకా ఇంటర్వ్యూ ఉంటుందా ఈవేళ?

ఈనాడు ధనమ్మ స్వర్ణసుందరి. బంగారానికి తావి అబ్బింది. బంధురానికి మాటలు వచ్చాయి. ఇన్నాళ్లూ తన అదృష్టదేవతకై కళ్లు కాయలు కాచేలా చూచాడు. ఈనాడు దొరకుతోంది. చూస్తాడు, మాట్లాడుతాడు-తలుచుకుంటే అదో భాగ్యరేఖ-స్వర్గసీమ.

ఇంతలో తనముందు వెళ్లినమనిషి తిరిగి వచ్చేస్తున్నాడు. భానుమూర్తి లోపల కాలుపెట్టాడు. కొంచెం వణకు పుట్టింది. లోపలంతా ఒక ఇంద్ర దర్బారు. స్వర్ణసుందరి - అపూర్వసుందరి సన్నని ఊదా సిల్కుచీర, అమర్చిన పట్టు చదావులు- సింహాసనంలాంటి సోఫా. విడజారిన కుంతలాలు ఉబికిన యౌవనంమీద పడివున్నాయి. ఒక ప్రక్క సెక్రటరీ-ఇంకో ప్రక్క రంగేళీ ఫిలిమ్స్ వారి రత్నాల డైక్టరు-భానుమూర్తి కేం మాట్లాడాలో తెలియలేదు. మెల్లిగా 'ధనం!' అని మాత్రం అన గలిగేడు.

జవాబు లేదు.

'ధనం'-బిగ్గరగా తబ్బిబ్బుగా. ఆమె దీర్ఘంగా చూస్తోంది కాని మాట్లాడదు. ఆ మానమే అతనికి బలం సమకూర్చింది.

'మీ పేరు'

'స్వర్ణసుందరి'

'ధనమ్మ'

'ఔను, చిన్నప్పుడు మావాళ్ళు అలాగే పిలిచేవారు'

'నేను జ్ఞాపకంవున్నానా? చిన్నప్పుడు మనిద్దరం కలిసి ఆడుకొనే వాళ్లం'

'కావొచ్చు, అట్టే జ్ఞాపకంలేదు. మీ పేరు?'

'భానుమూర్తి'

'సుందరిగారికి చిన్నటిమనుష్యులే జ్ఞాపకం వుండరు. ఇంతకీ వారికి చెప్పేమిటి. రోజుకి వెయ్యిమందిని వారు చూస్తుంటారు' అని రత్నాలడైరక్టరు పలికాడు. స్వర్ణసుందరి చిరునవ్వు. నాలుగు నిమిషాలు నిశ్శబ్దం.

'ఇంతకీ మీరు వచ్చినపని'... సెక్రెటరీ.

భానుమూర్తి నిర్ఘాంతపోయాడు.

'సుందరిగారిని చూద్దామని' అని మాత్రం అన్నాడు.

టంగ్, టంగ్, టంగ్.

'చిత్రం.'

భానుమూర్తి బయటకు వచ్చేసినా తలదిమ్ము తగ్గలేదు. ఎక్కడికిపోతున్నాడో తనకే తెలీదు. జూదంలో సర్వస్వం ఓడిన నలమహారాజులా అనిపించింది. తెలివివచ్చి చూచేసరికి సముద్రపు టొడ్డున ఓమూల పడివున్నాడు. సూర్యుడు అపరాద్రిని గ్రుంకుతున్నాడు. వాహ్యాళికై వచ్చిన దంపతులు తిరుగుముఖం పెడుతున్నారు. చీకటి పడుతోంది. కాని ఆ గాథ మెరుస్తూనేవుంది. ఆనాటి ఉదయం తన ఉత్సాహం, సాయంత్రం నిరుత్సాహం- ఇదే ఉదయాస్తమయాల వేదాంతం. ధనమ్మ స్వర్గసీమనుండి తన్ని నరకకూపంలోకి తోసేసినట్లయింది.

'ఎందుకు నాయనా, మామయ్య కూతురు సీతని కట్టుకోక ఈపట్నం సావాసాలు' అని తన తల్లి చెప్పినమాటలు జ్ఞాపకంవచ్చాయి. తన జాతకాన్ని చూచినట్లు పలికింది ముత్తైదువ.

ప్రపంచంమీద విరక్తి పుట్టింది. బ్రదుకే భారంగా తోస్తోంది. సముద్రంలో పడిపోదామా అనిపించింది. దూరాన కిళ్లీకొట్టుమీద 'ఎవరినే, నేనెవరినే' అని గ్రామఫోను పాట... 'మనిషివే, నువు మనిషివే' అని ఓకుర్రాడు పాడుకుంటూ పోతున్నాడు. భానుమూర్తికి నవ్వు వచ్చింది. ఆ కుర్రాడి కున్న నిశ్చింత తనకు లేదా? ఏమో. వాళ్ళకి ఏ ఆశయాలూ ఉండవు. కొన్ని నిమిషాలల్లాగే కళ్లు మూసుకు పడుకున్నాడు. దూరాన ఎవరో 'ఆ యనాథబాలిక ప్రియురాలు నాకు' అని చదువుతున్నారు. భానుమూర్తిలేచాడు పూర్తిగా విందామని. నిలబడ్డాడు. నాలుగడుగులు వేసి ఆగిపోయాడు. నవ్వుకున్నాడు. ఎవ్వరూ లేరు ఎప్పుడో తాను చదివిన పద్యభాగం. 'ఔను, ఈ యనాథబాలిక ప్రియురాలు నాకు.'

'ఏ యనాథ బాలిక?'

'నిరాశ, నిస్పృహ. ప్రపంచంలో ఈమె నెవరూ వరించ'రనుకున్నాడు. కొంచెం మనస్సుకి శాంతి లభించినట్లయింది. తన ప్రియురాలి పేరు తెలుసుకున్నట్లు ఆనందం అనుభవించాడు. గంటస్తంభం ఇంతలో ఔనన్నట్లు ఎనిమిది కొట్టింది. అతడూ ఉత్తరీయం సవరించుకుంటూ స్టేషన్‌కి చరచరా నడిచిపోయాడు.